ప్రజా సమస్యలపై నేడు ఎమ్మెల్యే సమీక్ష

మోతీనగర్: మూసాపేట డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 9 గంటలకు మోతీనగర్‌లోని వార్డు కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్‌కుమార్ తెలిపారు. కాలనీ, బస్తీల్లో ఏమైనా సమస్యలుంటే సంబంధిత కాలనీవాసులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు

మోతీనగర్: వయోవృద్ధులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సెంటర్ నిర్వాహకులు డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట కమ్యూనిటీహాల్‌లో పార్థివ్ లాంగ్ కేర్ సెంటర్, అవంతీనగర్ తోట సంక్షేమ సంఘం సంయుక్తాధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మధుమేహం బీపీ, చర్మ, దంత, కాళ్లు, ముక్కుతో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కనీసం ఆరు నెలలకు ఒకసారైనా సాధారణ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నిత్యం యోగా, జాగింగ్ వంటివి ఏదో ఒకటి అలవర్చుకుని క్రమం తప్పకుండా చేసినట్లయితే ఎలాంటి వ్యాధులు దరిచేరవన్నారు. వైద్యుల సూచన మేరకు మందులు వాడుతూ.. మితంగా ఆహారం తీసుకున్నట్లయితే మనిషికి ఎలాంటి జబ్బులు దరిచేరవన్నారు. సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి తెనాలి స్వామి తదితరులున్నారు.

డి. శ్రీనివాస్‌కు నివాళి



డి. శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భరత్‌నగర్ వాకింగ్ అసోసియేషన్ నాయకులు

మూసాపేట: మాజీ పీసీసీ చీఫ్ ధర్మపురి శ్రీనివాస్‌కు ఆదివారం భరత్‌నగర్ వాకింగ్ అసోసియేషన్ నాయకులు భరత్‌నగర్ పార్కులో ఆదివారం నివాళులర్పించారు. అధ్యక్షులు పి. నాగిరెడ్డి ఆధ్వర్యంలో శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షులుగా రెండు పర్యాయాలు చేసి, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చిన వ్యక్తి, మంత్రిగా రాష్ట్రానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఎం.సంతోష్‌కుమార్, కాలనీ అధ్యక్షులు అశోక్‌ముదిరాజ్, సీనియర్ నాయకులు హనుమంత్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, పాండు ముదిరాజ్, బుచ్చిబాబు, వేణు, కె.రవీందర్, వెంకటేశ్వర్లు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మూణ్నాళ్ల ముచ్చటగా జీహెచ్‌ఎంసీ జిమ్ సెంటర్లు

- కోచ్‌లను ఏర్పాటు చేయకపోవటంతో మూతపడ్డ జిమ్‌లు
- తుప్పు పట్టిన లక్షలాది రూపాయల జిమ్ పరికరాలు
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు







రిక్షాపుల్లర్స్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో జిమ్ సెంటర్‌లో తుప్పు పట్టిపోతున్న జిమ్ పరికరాలు

ఆల్విన్‌కాలనీ: నగరంలోని విద్యార్థులు, యువకులు, స్థానిక ప్రజలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి నాటి ప్రభుత్వం జీహెచ్ఎంసీ పరిధిలో జిమ్ సెంటర్‌లను ఏర్పాటు చేసింది. నేడు అవి మూత పడిపోయి, జిమ్ పరికరాలు తుప్పు పట్టి ఎందుకూ పనికి రాకుండా పోయాయి. ప్రజా సొమ్ము దుర్వినియోగం తప్ప స్థానికులకు ఒరగబెట్టింది ఏమీ లేదు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని జగద్గిరిగుట్ట రిక్షాపుల్లర్స్ కాలనీ, పాపిరెడ్డినగర్, ఆస్‌బెస్టాస్‌కాలనీ మధ్య ఉన్న మీ-సేవా బిల్డింగ్‌లో, ఎల్లమ్మబండ కమ్యూనిటీహాల్‌లో లక్షలాది రూపాయలు వెచ్చించి గత 4 సంవత్సరాల క్రితం హడావుడిగా జిమ్ సెంటర్‌లను ఏర్పాటు చేశారు. అవి మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది.

◆ జిమ్ సెంటర్‌లలో కోచ్‌లను ఏర్పాటు చేయకపోవటం.. జిమ్ పరికరాల నిర్వహణ పట్టించుకోకపోవటంతో స్థానికులకు, యువకులకు జిమ్‌పై అవగాహన కల్పించకపోవటంతో జిమ్ సెంటర్‌లలోని విలువైన పరికరాలను దొంగిలించుకుపోయినట్లు స్థానికులు తెలుపుతున్నారు. మరికొన్ని సెంటర్లలో అయితే పూర్తిగా పరికరాలే కనుమరుగయ్యాయి.

◆ రిక్షాపుల్లర్స్ కాలనీలోని జిమ్ సెంటర్‌లో కమ్యూనిటీహాల్‌లోని ఒక మూలన పడేసి చేతులు దులుపుకోవటంతో జిమ్ పరికరాలపై దుమ్ము, ధూళి పేరుకుపోయి తుప్పు పట్టిపోయి దేనికి పనికిరాకుండా పోయాయని, కనీసం ఆ రూమ్ ఇతర అవసరాలకు పనికిరాకుండా పోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇదే కమిటీ హాల్ నందు అంగన్‌వాడీ కేంద్రం కూడా కొనసాగుతోంది. కనీసం కేంద్రానికి అయినా ఉపయోగపడేలా రూంను శుభ్రం చేసి ఇస్తే బాగుంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

◆ ఎల్లమ్మబండ కమిటీహాల్‌లో జిమ్ పరికరాలు పోయాయని, ఇదే సెంటర్‌లో బస్తీ దవాఖానా నిర్వహిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. పాపిరెడ్డినగర్‌లోని జిమ్ సెంటర్‌లో జిమ్‌కు సంబంధించిన విలువైన వస్తువులు పూర్తిగా దొంగిలించుకెళ్లినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధుల అలసత్వం, ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజల సొమ్ము దుర్వినియోగం అయిందే తప్ప జిమ్ వల్ల ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని పేర్కొంటున్నారు.

◆ ఇప్పటికైనా ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు జిమ్ సెంటర్‌లను పరిశీలించిన నాడు జిమ్ సెంటర్‌లలో ఏర్పాటు చేసిన పరికరాలను రిజిస్టర్ ఆధారంగా పరికరాలు ఉన్నాయో లేవో తనిఖీ చేసి దొంగిలించిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అదే విధంగా యువతను దృష్టిలో ఉంచుకొని పట్టణంలో యువత ఆరోగ్య దృష్ట్యా జిమ్ సెంటర్‌లలో జిమ్‌ను ప్రతి రోజూ నడిపే విధంగా కోచ్‌లను ఏర్పాటు చేసి, జిమ్ పరికరాలను సరైన పద్ధతిలో నిర్వహణ చేపట్టి నడపాలని పలువురు యువకులు కోరుతున్నారు.

జిమ్ సెంటర్లను తిరిగి తెరవాలి..



ఈ చుట్టు పక్కల ప్రాంతాల్లో పార్కులు, మైదానాలు లేకపోవటంతో యువకులు క్రీడారంగం వైపు దృష్టి మరల్చలేకపోతున్నారు. వారి ఆరోగ్య దృష్ట్యా గతంలో ప్రభుత్వం పలు ప్రాంతాల్లో జిమ్ సెంటర్‌లను ఏర్పాటు చేసింది. మొదట్లో బాగా నడిచినప్పటికీ సరైన కోచ్ లేకపోవటం, జిమ్ పరికరాలను నిర్వహించే వారు లేకపోవటంతో అవి కాస్తా మూత పడ్డాయి. రాజకీయాలకతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు యువకులను దృష్టిలో ఉంచుకొని జిమ్ సెంటర్‌లను తిరిగి తెరిచి సరైన కోచ్‌లనే ఏర్పాటు చేస్తే బాగుంటుంది. - చిరుమర్తి రాజు, స్థానికుడు

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ తోటలోని శ్రీ సద్గురు సాయి దేవాలయ వార్షికోత్సవం ఆలయ కమిటీ, సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సాయినాథుడిని పుర వీధుల్లో మహిళా మండలి ఆధ్వర్యంలో కోలాటం, భాజా భజంత్రీల నడుమ పల్లకీ సేవ జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ స్వామి, మాజీ అధ్యక్షుడ గార్లపాటి మోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు, యాదగిరి యాదవ్, నాగేశ్వరరావు, రవీందర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజయ్య పటేల్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ దేవినగర్‌లోని మాధవరం రాజయ్య పటేల్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాజయ్య పటేల్ కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆవిష్కరించారు. కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, కూకట్‌పల్లి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్‌గా కె.ముత్తు



మూసాపేట: కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్‌గా కె. ముత్తు ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కృష్ణ మోహన్ మాదాపూర్ సీఐగా బదిలీపై వెళ్లారు. పోలీస్‌స్టేషన్ సిబ్బంది, పలువురు బాధ్యతలు తీసుకున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా రంగనాయక స్వామి కల్యాణోత్సవం



మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు సమీపంలోని రంగనాయకస్వామి ఆలయంలో స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా జూలై 3 వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజల అనంతరం రంగనాయకస్వామి తిరుక్కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. జులై 2న సంతానప్రద గరుడ ప్రసాద గోష్ఠి, చక్రతీర్థం, పుష్పయాగం, 3న తులసీ దళార్చన తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పరామర్శ.. ఆర్థికసాయం



మరణించిన కుటుంబసభ్యులను పరామర్శించిన జగదీశ్వర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఖాజానగర్‌లో నివాసం ఉంటున్న సలామ్, జయశంకర్‌కాలనీలో నివసించే యాదగిరి అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. ఈ సందర్భంగా ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు మరణించిన వారి కుటుంబసభ్యులను పరామర్శించి ఇరు కుటుంబ సభ్యులకు రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు.

జీహెచ్‌ఎంసీలో విలీన నిర్ణయం హర్షణీయం

కూకట్‌పల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు బండి రమేష్



కూకట్‌పల్లి: సికింద్రాబాద్-కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని సివిలియన్ ప్రాంతాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా కూకట్‌పల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు బండి రమేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలుమార్లు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకువెళ్లారు. స్వయంగా ప్రధానమంత్రిని కలిసి ప్రత్యక్షంగా సమస్యలను విన్నవించారన్నారు. దీంతో రక్షణశాఖ, ప్రధానమంత్రి సానుకూలంగా స్పందించి కంటోన్మెంట్ బోర్డులని రద్దు చేసి స్థానిక పురపాలక సంఘాల్లో విలీనం చేయాలని శనివారం నిర్ణయించారు. దీనిపై బండి రమేష్ మాట్లాడుతూ బ్రిటీష్‌కాలం నాటి చట్టాలను ఇప్పటికైనా తొలగించి కంటోన్మెంట్ బోర్డును రద్దు చేసి పురపాలక సంఘాల్లో కలపటం హర్షణీయమన్నారు. దీనికి విశేషంగా కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారన్నారు.

మస్లిం శ్మశానవాటిక పరిశీలన



ముస్లిం శ్మశానవాటికను పరిశీలించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలోని ముస్లిం శ్మశాన వాటికను ఆదివారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లిం శ్మశాన వాటికలో ప్రస్తుతం ముఖద్వారం ఆర్చ్, ప్రార్థన హాల్ నిర్మాణం పూర్తయ్యాయన్నారు. శ్మశానవాటిక చుట్టూ.. నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ నిర్మాణం కొంత మేర పెండింగ్‌లో ఉందని దానిని కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. శ్మశానవాటికలో చెట్లు నాటి రోడ్లు వేసి సుందరీకరిస్తామని హామీ ఇచ్చారు. శివరాజ్‌గౌడ్, షౌకత్ అలీ మున్నా, ఫారూఖ్, ఖాజా, ఖాజామియా, సమ్మద్, వాసుదేవరావు, బాలస్వామిసాగర్, ఫిరోజ్,బషీర్, యాకుబ్, గౌస్ తదితరులున్నారు.

డైమండ్స్ షో ప్రారంభం



డైమండ్స్ షోను ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు, వినియోగదారులు

కూకట్‌పల్లి: ప్రపంచంలో అతి పెద్ద జ్యువెలరీ సంస్థలో ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కూకట్‌పల్లి షోరూంలో మైన్ డైమండ్స్ షోని ఆదివారం ప్రారంభించింది. నగలు, వివాహ ఆభరణాలు, లైట్ వెయిట్ ఆభరణాలు, పురుషుల ఆభరణాలు, ప్లాటినం ఆభరణాలను ప్రదర్శనలో పెట్టారు. జూలై 7వ తేదీ వరకు ఈ డైమండ్ షో కొనసాగుతుందని షోరూం హెడ్ శ్రీనివాస్ తెలిపారు. బంగారం విలువలో 5శాతం ముందుగా చెల్లించి అడ్వాన్స్ బుకింగ్ సదుపాయాన్ని పొందవచ్చని తెలిపారు.

కంకర తేలిన రోడ్లు.. పూర్తి చేయడంలో మీనమేషాలు



పాండురంగనగర్ బస్టాప్ సమీపంలో కంకర తేలిన రోడ్డు



అవంతినగర్ తోట విజేత స్కూల్ లైన్‌లో..



అల్లాపూర్ నుంచి బోరబండ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారి ఇలా..

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట పాండురంగానగర్‌లోని పలు వీధుల్లో రోడ్లు వేయకపోవటంతో స్థానికులకు ఇబ్బందికరంగా మారింది. రోడ్డు నిర్మాణం చేపట్టని ప్రాంతాల్లో చిన్నపాటి వర్షం పడినా ఆ రోడ్డు అంతా బురదమయంగా తయారవుతున్నాయి. అదే విధంగా పాండురంగానగర్‌లోని బస్‌స్టాప్ సమీపంలో రోడ్డు లేకపోవడంతో ఆ రోడ్డు అంతా కంకరతేలి మట్టితో నిండిపోయింది. పలుమార్లు రోడ్డు వేయాలని సంబంధించిన అధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిదులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. కొన్ని రోజుల క్రితం శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉండటంతో పనులను అధికారులు పూర్తి చేయలేదు. కోడ్ ముగిసినా రోడ్డు పనులు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అవంతినగర్ తోట, పాండురంగానగర్ కాలనీ, అల్లాపూర్ డివిజన్‌లోని బోరబండ నుంచి ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్‌కి వెళ్లే రోడ్డును సైతం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థుల ఆందోళన విరమణ

రాయదుర్గం: విద్యార్థులపై సస్పెన్షన్ విధించడంతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని ఆదివారం విరమించారు. హెచ్‌సీయూలో ఆరు రోజులపాటు క్యాంపస్‌లోని నార్త్ షాపింగ్ కాంప్లెక్స్ సమీపంలోని వెలివాడ వద్ద నిరసన దీక్షలు చేపట్టిన విషయం తెలిసిందే. హెచ్‌సీయూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు అతీక్, మాజీ అధ్యక్ష, కార్యదర్శులుసోహెల్, మోహిత్‌తోపాటు మరో ఇద్దరు ఆందోళన కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. యూనివర్సిటీ అధికారులు విద్యార్థులతో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవడంతో వివాదం సద్దుమణిగింది.

విద్యార్థిని అదృశ్యం



ప్రహర్షిణి (ఫైల్)

మూసాపేట: నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థిని ఇన్‌స్టిట్యూట్‌కు వెళ్లి అదృశ్యమైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సూరారానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమార్తె ప్రహర్షిణి (17) కూకట్‌పల్లిలోని ఓ ఇన్‌స్టిట్యూట్‌లో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటోంది. ఎప్పటిలాగా ఆమె నాన్న ఉదయం 9గంటలకు ఇన్‌స్టిట్యూట్ వద్ద దించి వెళ్లాడు. మళ్లీ సాయంత్రం 6.30 గంటలకు తీసుకెళ్లేందుకు రాగా ప్రహర్షిణి కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించకపోవటంతో కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎంపీ రమేష్ రాథోడ్‌కు నివాళి



ఆల్విన్‌కాలనీ: ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ అంత్యక్రియల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి పాల్గొని రమేష్ రాథోడ్ పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రమేష్ రాథోడ్ జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, ఎంపీగా చేసిన సేవలు మరువలేనివన్నారు. ముఖ్యంగా గిరిజన సంఘం సంక్షేమం, అభివృద్ధికి ఆయన చేసిన విశేష కృషి చేశారన్నారు.